క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



టేకుమట్ల: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని ఎస్సై ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో వాహన తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్సూ కలిగి ఉండాలని తెలిపారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదన్నా రు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య, కానిస్టేబుల్ మహేందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏపీఓ మృతి



బీమ్‌రావు(ఫైల్)

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఏపీఓ (జనరల్)గా పనిచేస్తున్న కనక బీమ్‌రావు (56) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతు బుధవారం రాత్రి మృతి చెందాడు. ఆసీఫబాద్ జిల్లాలోని వాంకిడి మండలం బాంబర గ్రామానికి చెందిన బీమ్‌రావు ఐటీడీఏ ఏపీఓగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా, కొద్ది రోజుల నుంచి అనారోగ్యానికి గురై పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఏపీఓ మృతి చెందడంతో తోటి అధికారులు, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రాతోపాటు ఉద్యోగులు ఆత్మశాంతించాలని కోరారు.


ఐటీడీఏ అటెండర్..



మొకాళ్ల లక్ష్మి(ఫైల్)

ఏటూరునాగారం: ఏటూరునాగారం ఐటీడీఏలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న మొకాళ్ల లక్ష్మి(60) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. ఐటీడీఏలో 20 ఏళ్లుగా పర్మనెంట్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఆమె మృతి చెందడంతో తోటి ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తాడ్వాయిలో జరిగిన అంత్యక్రియలకు తోటి ఉద్యోగులు హాజరై సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో గేదె..



వెంకటాపురం(ఎం): విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని రామాంజాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. బాధిత రైతు గుర్రాల రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గేదె మేత కోసం గ్రామ శివారులోని ఎరుకల నాంచారమ్మ గుడి వైపు వెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో గేదె తగిలి షాక్‌తో మృతిచెందినట్లు పేర్కొన్నారు. సుమారు రూ.90 వేల విలువ చేసే గేదె మృతిచెందడంతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతు కన్నీటి పర్యంతమయ్యారు.

పల్లెల్లో పచ్చదనమే లక్ష్యం

- నర్సరీల్లో జోరుగా పనులు
- 4.58 లక్షల మొక్కల పెంపకం



నర్సరీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

రేగొండ: పల్లెల్లో పచ్చదనం పెంపొందించేండమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణకు హరితహారం పేరిట మొక్కలు నాటగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో వచ్చే ఏడాదికి కసరత్తు చేపట్టింది. ప్రతీ గ్రామంలో విరివిగా మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టారు. అవసరమైన మొక్కలను ఇప్పటి నుంచే నర్సరీల్లో పెంచేందుకు వీలుగా ఏర్పాట్లు ప్రారంభించారు.

4.58 లక్షల మొక్కల పెంపకం

మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 4.58 లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటికే వివిధ నర్సరీలలో 1.91 లక్షల మొక్కలు అందుబాటులో ఉండగా మిగతా 2.66 లక్షల మొక్కలను ప్రస్తుతం పెంచేందుకు చర్యలు చేపట్టారు. ప్రతీ నర్సరీల్లో 12 వేల మొక్కల చొప్పున పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా 37 గ్రామాల్లోని నర్సరీల్లో లక్ష్యం మేరకు మొక్కలు పెంచేందుకు వీలుగా ఉపాధిహామీ కూలీలతో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం కూలీలు ఎర్రమట్టిని జల్లెడతో శుద్ధిచేసి పాలిథిన్ సంచుల్లో నింపుతున్నారు. వారం రోజుల్లో సంచుల్లో మట్టినింపడం పూర్తయిన అనంతరం విత్తనాలు నాటే పనులు చేపడుతారు.

ఈత, తాటి మొక్కలకు ప్రాధాన్యం

గతంలో నర్సరీల్లో పూలు, పండ్ల మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలు పెంచారు. ప్రస్తుతం ఈత మొక్కలతో పాటు కరివేపాకు, మునగ, నేరేడు, జామ, సపోటా, నారంజీ, మందార తదితర మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే ప్రతీ నర్సరీలో 500 నుంచి 1000 మొక్కల చొప్పున ఈత, తాటి మొక్కలు పెంచాలని నిర్ణయించారు. వీటితో పాటు గతంలో మాదిరిగానే ఇతర మొక్కలను పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

> **నర్సరీ పనులు ప్రారంభం**
>
> అన్ని గ్రామాల్లో నర్సరీ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం కూలీలు సంచుల్లో మట్టి నింపుతున్నారు. గతేడాది పెంచిన మొక్కలు సంరక్షించడంతో పాటు కొత్తగా మొక్కలు నాటడం జరుగుతుంది.
>
> – వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

రైతులకు పట్టాలు ఇవ్వాలి

- తుమ్మల వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్ రెడ్డి

గోవిందరావుపేట: మండలంలో పట్టాలు లేని రైతులకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గుండు రామస్వామి అధ్యక్షతన నిర్వహించిన రైతుల సమావేశానికి రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మండలంలో వేలాది మంది రైతులకు పట్టాలు లేక ప్రభుత్వ పథకాలు వర్తించక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వం ధరణి పేరుతో కాస్తు కాలం తీసివేయడం వల్ల రైతుల పరిస్థితి ఇబ్బందిగా ఉందన్నారు. పోడు రైతులకు హక్కులు కల్పించాలని, అర్హులైన రైతులందరికీ రైతుబంధు వర్తింపచేయాలని ఈ నెల 27న మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాకు పార్టీలకు అతీతంగా రైతులు అధిక సంఖ్యలో వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కోటేశ్వరరావు, లెనిన్, భిక్షం, రాజు, వెంకన్న, నర్సయ్య ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారి పవన్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి పవన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సబ్ సెంటర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం సికిల్ సెల్ స్కినింగ్, అబాకార్డుల ఆన్‌లైన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అశీష్, సిబ్బంది భారతి, సమ్మక్క తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గోవింద్‌నాయక్

ఏటూరునాగారం: సీఆర్‌టీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గోవింద్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కొన్ని రోజులుగా సీఆర్‌టీలు చేపట్టిన నిరవధిక సమ్మెను ఆయన సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. ఐటీడీఏ పరిధిలోని విద్యాలయాల్లో 20 ఏళ్లుగా వెట్టిచాకిరి చేస్తున్న సీఆర్‌టీలను క్రమబద్ధీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌టీలు రవీందర్, రాము, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కాటారం: వర్షం కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కిరణ్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంట చేతికి వచ్చే సమయానికి వర్షార్పణం అయిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని తడిసిన ధాన్యం ప్రభుత్వం మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. పత్తి, మిర్చి రైతులకు సైతం వర్షం తీరని నష్టం చేకూర్చింది అని పంట నష్టం అంచనా వేయించి వెంటనే పరిహారం అందించాలన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం పూజలు



తిరుమలలో పీఆర్టీయూ నాయకులు

రేగొండ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ రేగొండ పీఆర్టీయూ మండల అధ్యక్షుడు దుస్స సధాకర్ ఆధ్వర్యంలో కాలినడకన తిరుపతి గట్టు ఎక్కి ప్రత్యేక పూజలు చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్న శ్రీపాల్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలిచి చట్టసభల్లో కూడా ఉపాధ్యాయుల పక్షాన మాట్లాడాలని వారు ఆకాంక్షించారు. ఆయన వెంట గణపురం పీఆర్టియూ మండల అధ్యక్షుడు బిల్లా రఘునాథరెడ్డి, రేగొండ మండల ప్రధాన కార్యదర్శి కొమిరెడ్డి మధుకర్ రెడ్డి ఉన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై పవన్‌కుమార్

కాళేశ్వరం: మహదేవపూర్ గ్రామానికి చెందిన చేనపూరి మహేష్ అనే విద్యార్థి మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి బాధితుడికి ఎస్సై పవన్‌కుమార్ గురువారం అందజేశారు. ఫోనును గుర్తించడంలో కృషిచేసిన కానిస్టేబుల్ చంద్రమోహన్‌ను ఎస్సై అభినందించారు.

గ్యాస్ ఏజెన్సీ ప్రారంభం

గోవిందరావుపేట: మండల పరిదిలోని పస్రా గ్రామ శివారులో ముకంద గ్యాస్ ఏజెన్సీని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ గురువారం ప్రారంభించారు. సోమయ్య, వెంకన్న, సాయిబాబు, శ్రీకాంత్, చంద్రశేకర్, క్రాంతి, కిరణ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీను, మధు పాల్గొన్నారు.

అన్నదానం

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని అమృత వర్షిణి అనాథాశ్రమంలో కాటారం మండలంలోని దామెరకుంటకు చెందిన తోడే శ్వేత వంశీకృష్ణ దంపతులు వారి కుమారుడు శ్రీతిక్‌వేదాన్ష్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు శ్యామ్, తిరుపతిరెడ్డి, అజయ్‌రెడ్డి, శ్రీప్రియ, సూరం వర్షిత పాల్గొన్నారు.

పొదలు, పిచ్చి చెట్ల తొలగింపు



వాజేడు: మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణ నుంచి జూనియర్ కళాశాలకు వెళ్లే రహదారి వరకు ఉన్న పొదలను, పిచ్చి చెట్లను గురువారం తొలగించారు. రహదారికి ఇరువైపులా పొదలు, పిచ్చి చెట్లు పెరిగి ప్రమాదకరంగా ఉండటంతో అధికారులు ప్రొక్లెయినర్ సహకారంతో వాటిని తొలగించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పూజ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పద్మ దంపతులు

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని చతుర్రూప అయ్యప్ప దేవాలయంలో గురువారం అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు–పద్మ దంపతులు హాజరయ్యారు. ఉదయం నుంచి ప్రత్యేకంగా పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులకు మధ్యాహ్నం మహాన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, గాయకులు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను అలరించాయి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అయ్యప్ప దేవాలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గుడి పూజారి కృష్ణమచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ లట్ట రాజబాబు, శివారెడ్డి, కొరె కుమార్, భాగవతం వీరస్వామి, బండారి రమేష్(సురభి), ఓరం వాసు, శ్రీనివాస్, సురిమిల్ల శ్రీనివాస్, బండబాపు, ఆకుల మహేందర్, బుద్దిలక్ష్మణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంపై రాద్ధాంతం సరికాదు

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: మండలంలోని మంజూర్‌నగర్‌లో నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు పూర్తి కాలేదని ఆలయంపై రాద్ధాంతం చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. గురువారం మంజూర్‌నగర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ నిర్మాణంలో ఎలాంటి అవినీతి జరగలేదని, నయా పైసాతో లెక్కలన్ని ఉన్నాయన్నారు. ఇది ఒక్క వ్యక్తి ఆస్తి కాదని ప్రజల ఆస్తి అని తాము భక్తుడిగా భగవంతుడి సేవకులం మాత్రనని తెలిపారు. ఆదాయం లేక ప్రతినెల టెంపులు నిర్వహణకు సొంతంగా ఖర్చులు పెడుతున్నామని తెలిపారు. ఈ ఆలయం ఖర్చుల కోసం ఆదాయం పెంచడానికి దుకాణాల నిర్వహణకు కాంప్లెక్స్ నిర్మిస్తే కోర్టులో కేసు ఉండటంతో పనులు ఆగిపోయన్నారు. దీంతో మరుగుదోడ్లు కట్టించలేక పోతున్నామని భక్తులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆలయంలో రాజగోపురం, ఉత్తర ద్వారం, యాగశాల, చుట్టూ ప్రహరీ, పాకశాల నిర్మాణం పనులు చేయాల్సి ఉందని ఇప్పటికే కొంత మెటీరియల్ కూడా వచ్చిందన్నారు. సంక్రాంతి పండగ తర్వాత పనులు ప్రారంభ కానున్నాయని తెలిపారు. ఆలయం పూర్తి అయిన తర్వాత తిరుమల తిరుపతి దేవాస్థానికి లేదా ఎండోమెంట్‌కు అప్పగించడానికి తాము సిద్ధమన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, కౌన్సిలర్లు, రవికుమార్, నూనెరాజు, ఎడ్ల మౌనిక శ్రీనివాస్, ముంజంపల్లి మురళి, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఎర్రజెండా



వెంకటాపురం(కె): జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



రేగొండ: ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

- సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు



వెంకటాపురం(ఎం)లో..

వెంకటాపురం(కె): కార్మికులకు అండగా ఎర్రజెండా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు అన్నారు. గురువారం మండలంలో సీపీఐ 100వ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. నిరంతరం కార్మికులు, ప్రజా సమస్యలపై పోరాటం చేసే పార్టీ సీపీఐ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు అచంటి ప్రసాద్, నాసర్, మండల నాయకులు సంఖ్య ఆదినారాయణ, కట్ల రాజు, నర్సింహారావు, నాగేశ్వరావు, రాము, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

రేగొండ: భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ వేడుకలు గురువారం మండలంలోని తిరుమలగిరి గ్రామంలో నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి శాంతికుమార్ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటిన పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలను కేంద్రం అమలు చేయడం లేదన్నారు. రైతులు, కూలీలు, కార్మికుల కోసం ఉద్యమించిన ఘనత సీపీఐదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పెంట రవి, నాయకులు అన్నారపు రాజేందర్, చిగురుమామిడి మోహన్, కుడారి భవాని, సాదు సారంగపాణి, పర్స రాజయ్య, లీగ సారంగం, కాసర్ల శ్రీనివాస్, రమేష్, కుమారస్వామి, చాందిని, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(ఎం): సీపీఐ ఆవిర్భావించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ జెండాను మండల కార్యదర్శి బండి నర్సయ్య గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గాలి సమ్మయ్య, పెరుక పోశాలు, గుర్రం రమేష్, మేకల సమ్మయ్య, నాగరాజు, రాజబాబు, కనుకయ్య, కాంగ్రెస్ నాయకులు మిల్కూరి అయిలయ్య, మామిడిశెట్టి స్వామి, జంగిలి రవి, కోడారి చేరాలు, తోట సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రాశులపై పరదాలు కప్పుతున్న రైతు



కమ్ముకున్న మేఘాలు

- ఆందోళనలో రైతన్నలు



మేఘావృతమై ఉన్న ఆకాశం

వాజేడు: తుపాను ప్రభావంతో మండలంలో ఆకాశం మేగావృతమై ఉంది. బుధవారం చిరు జల్లులు కురువగా గురువారం ఉదయం నుంచి మబ్బులు పడి ఉండడంతో రైతులు భయపడుతున్నారు. వర్షం కురిస్తే ఏపుగా పెరిగిన మిరుప చేలు దెబ్బ తింటాయని వర్షం నీరు బయటకు వెళ్లడానికి అనుకూలంగా కాల్వలు తీశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లతో కప్పి ఉంచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బులు తొలగి పోకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం

- పూర్తికాని ఆర్‌అండ్‌బీ నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులు
- ఏడేళ్లు గడిచినా పట్టించుకోని అధికారులు



కమలాపురంలోని ఆటో స్టాండ్ నుంచి బీటీ వేయకుండా వదిలేసిన రోడ్డు



కమలాపురంలో అభివృద్ధి పనులకు 2017లో శంకుస్థాపన చేసిన శిలాఫలకం

మంగపేట: కమలాపురంలో అసంపూర్తిగా నిలిచిపోయిన బైపాస్ రోడ్డు నిర్మాణానికి మోక్షమెప్పుడో అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. కమలాపురంలోని రాంనగర్ (పీఆర్) రోడ్డు నుంచి గుడ్డేలుగులపల్లి మీదుగా ఆటోస్టాండ్ (ఆర్‌అండ్‌బీ రోడ్డు) వరకు రోడ్డు పనులతో పాటు ఎర్రవాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులకు 2017లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2.45 కోట్ల అంచనాతో నిధులు మంజూరు చేసింది. కమలాపురంలోని ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డు పర్లాంగురాయి వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు గాను మరో రూ.3 కోట్ల అంచనాతో నిధులను మంజూరు చేశారు. బైపాస్ రోడ్డుపై ఎర్రవాగు బ్రిడ్జి నిర్మాణం, రోడ్డు మెటల్ పనులు పూర్తి చేసి బీటీ వేయకుండా వదిలేశారు. గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డును నాలుగు లైన్ల పనులు పూర్తి చేశామని పూర్తి స్థాయిలో నిధులు లేక పోవడంతో ఆయా పనులను పూర్తి స్థాయిలో జరుగలేదని టెండరు ద్వారా పనులు దక్కించుకున్న గుత్తేదారు తెలుపుతున్నాడు. నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు చేసిన గుత్తేదారు నాసిరకంగా పనులు చేపట్టడంతో చేసిన ఆరు నెలలకే బీటీ లేసిపోయి రోడ్డు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. రోడ్డుపై లేచి పోయిన బీటీని తొలిగించిన అధికారులు తిరిగి నేటి వరకు మరమ్మతులు చేపట్టక పోవడం, బీటీ వేయక పోవడం గమనార్హం. రాంనగర్ రోడ్డు నుంచి ఆటోస్టాండ్ వరకు వేసిన గ్రామం మధ్యలో నుంచి వేసిన మెటల్ రోడ్డుపై రాళ్లు లేవడంతో నడిచి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బదులు పడుతున్నామని స్థాని కు లు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుపై బీటీ వేసే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈఈ రఘువీర్‌ను ఫోన్‌లో సంప్రదించగా రెండు పనులకు సరిపడ నిధులు లేక పోవడంతోపనులు నిచి పోయాయని తెలిపారు. బీటీ లేచి పోయిన విషయం నిజమే అని తెలిపారు.

> **అధికారులకు పట్టింపులేదు**
>
> 
>
> గ్రామం మధ్య నుంచి బైపాస్ రోడ్డు కోసం మెటల్ రోడ్డు పనులు చేసి మధ్యలో వదిలేశారు. దీంతో రోడ్డుపై కంకర తేలి ఉంది. వాహనాల వెళ్లేటప్పుడు టైర్ల కింద పడిన కంకర రాళ్లు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లలోకి దూసుకు వస్తున్నాయి. విషయంపై సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.
>
> – సురేశ్, మాజీ ఎంపీటీసీ, కమలాపురం

ఇరుముడులకు హనుమాన్ మాలధారులు



ఇరుముడులకు వెళ్తున్న హనుమాన్ మాలధారులు

వాజేడు: హనుమాన్ దీక్షను చేపట్టిన భక్తులు ఇరుముడుల కోసం గురువారం వెళ్లారు. మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద మాలలు ధరించిన స్వాములు 41 రోజుల పాటు దీక్షలను చేసి ఇరుముడులకు తరలివెళ్లారు.